తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) ఉగాది మినీ కథల పోటీలో రు. 300 గెలుపొందిన రచన

# మేక మాంసం

ఎ. లక్ష్మీదేవి

మధ్యాహ్నం మూడు గంటలు. నరసింహశాస్త్రి నిద్ర నుంచి లేచి బైటకొచ్చేడు.

ముందు గదిలో కూతురు లక్ష్మి మనవడు కుమార్‌ను ఆడిస్తోంది. తండ్రిని చూసి "రండి నాన్నగారూ!" అంటూ లేచింది.

"ఫర్వాలేదు. వాడ్ని ఆడనీయమ్మా. బంగారు కొండా ఇట్రారా కుమారా!" అని పిల్చేడు నరసింహశాస్త్రి.

వాడు అమ్మ వళ్ళోంచి పక్కకు రాలేదు. పైగా "నేను రాను పో" అన్నాడు.

"తప్పు. అలా అనకూడదు. తాతగారి దగ్గిరి కెళ్ళు" నచ్చచెప్పింది లక్ష్మి.

కుమార్ తాతగారి దగ్గర కెళ్ళలేదు కానీ బైటకు పరుగుతీశాడు ఏదో బండి కనపడడంతో.

"ఎప్పుడొస్తాడటమ్మా అల్లుడుగారు" కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.



"రేపు సాయంత్రానికల్లా వచ్చేస్తారు నాన్నా!" చెప్పింది లక్ష్మి.

నరసింహశాస్త్రిగారి పెద్ద బిడ్డ లక్ష్మి, అయిదేళ్ళ మనవడు కుమార్. పండుగకు వచ్చేరు. అల్లుడు మోహన్‌రావు రేపు వస్తాడు.

ఇంతలో కుమార్ "అమ్మా! మేక మాంసం కావాలి!" అని అర్చుకుంటూ లోపలికివచ్చాడు.

మొదట అంతగా పట్టించుకోలేదు నరసింహశాస్త్రి. వాడు "అమ్మా! మేక మాంసమే" అని అరుస్తుంటే పరీక్షగా విన్నాడు. సందేహం లేదు. వాడు అరిచేది మేక మాంసం కోసమే.

"ఇలా రా కుమార్. నీకు నేనిస్తాగా! ఏం కావాలి?" అడిగాడు.

"నాకు మేక మాంసం కావాలి తాతయ్యా!" మూడేళ్ళ కుమార్ గారంగా అడిగాడు.

గుండెలదిరేయి నరసింహశాస్త్రికి. బ్రాహ్మణ పుట్టుక పుట్టి వీడి నోటి వెంట ఇలాటి మాటలు

## స్వపరిచయం

పేరు ఎ. లక్ష్మీదేవి. కథల పోటీ ఫలితాల్లో నా పేరు చూసి ఆశ్చర్యపోయాను. ఎందుకంటే నేను వ్రాసిన కథల్లో మొట్ట మొదటిసారిగా ప్రచురణకు అంగీకరింపబడిన కథ, అదీగాక బహుమతి వచ్చిన కథ ఇదే.

నా గురించి పెద్దగా చెప్పుకునేందుకు ఏమీ లేదు. భర్త ఎ. రామమోహన్‌గారు కార్పొరేషన్ బ్యాంక్‌లో ఆఫీసర్. నలుగురు అబ్బాయిలు. ఇంతకుముందు చాలా వ్యాసాలు వివిధ పత్రికలలో వచ్చాయి. కథలు అంతగా వ్రాయలేదు. కథలు వ్రాయమని ప్రోత్సహించింది ముఖ్యంగా శ్రీవారు. నేను వ్రాసిన కథ 'మేకమాంసం' చూసి విమర్శించింది మా పెద్దబ్బాయి రాజ శేఖర్. ఈ కథకు ప్లాట్ చెప్పింది కూడా వాడే.



—ఎ. లక్ష్మీదేవి, అనంతపురం

వస్తున్నాయేమిటి అని మనసులో అనుకుని కూతురి వేపు చూశాడు దీనికేమి సమాధానం చెపుతావు అన్నట్లు.

బిత్తరపోయి చూస్తోంది లక్ష్మి.

"మనం బ్రాహ్మలం రా! మేక మాంసం తినకూడదు. జంతు వధ చేస్తే పాపం వస్తుంది" నచ్చ చెప్పాడు నరసింహశాస్త్రి మనవడికి.

"ఊ. అదేం కుదర్దు. నేను మా ఇంట్లో ఎన్నిసార్లో తిన్నాను. మా నాన్న కూడా తింటాడు. మాకు పాపం రాలేదు. నాకు మేక మాంసం కావాలి. ఊఁ ఊఁ" అని ఏడ్వసాగాడు కుమార్.

ఛెళ్ళున చర్నాకోలతో చరిచినట్లైంది నరసింహ శాస్త్రికి. 'ఏదో పిల్లవాడు అని ముచ్చటపడితే మేక మాంసం అంటాడా! పైగా మేము ఇంట్లో తిన్నాము అని అంటాడా...'

మనవడిని ఒక్కతోపు తోశాడు. వాడు వెళ్ళి అమ్మను పట్టుకుని ఏడుస్తున్నాడు మేక మాంసం అంటూ.

అలికిడికి, మాటలకు లోపల్నుంచి నరసింహ శాస్త్రి భార్య లక్ష్మీనరసమ్మ, కోడలు హిరణ్మయి బయటికొచ్చేరు.

వాళ్ళను చూసి మరింత ఏడుపు పెంచాడు కుమార్ "మేక మాంసం" అంటూ.

"ఏమిటండీ! పిల్లవాడ్ని అలా తోశారు" కంగారుగా అడిగింది భార్య.

"ఆ ప్రాప్తుడి కోరిక ఏమిటో విను. నీ ముద్దుల మనవడికి మేక మాంసం కావాలట. తెస్తాను. వండి తినిపించు" హుంకరించేడు నరసింహశాస్త్రి.

"శివ శివ" అంటూ చెవులు మూసుకొంది లక్ష్మీనరసమ్మ.

"మీరుండండి. వాడ్ని కంగారు పెట్టొద్దు. నేను అడుగుతాగా. చెప్పరా కన్నా నీకేం కావాలి." మారి మిగా కుమార్‌ను చేరదీస్తూ అంది లక్ష్మీనరసమ్మ.

"మేక మాంసం."

"చంపేస్తా ప్రాప్తుడా మళ్ళీ ఆ కూత కూశావంటే!" కొట్టేందుకు వచ్చేడు నరసింహశాస్త్రి.

మరింత గట్టిగా ఏడవడం ప్రారంభించేడు వాడు.

"ఛ! మీరుండండి. నేను కనుక్కుంటాగా!" అని కుమార్‌ను ప్రశ్నించడం ప్రారంభించింది లక్ష్మీనరసమ్మ.

"చెప్పరా కుమారా! మేక మాంసం ఎలా వుంటుంది?"

"ఎర్రగా" బదులిచ్చాడు వాడు.

"నువ్వు ఎప్పుడైనా తిన్నావా?"

"ఓ! నాన్న తెచ్చేవాడు. నేను, నాన్న తినే వాళ్ళం. అమ్మ మాత్రం తినేది కాదు."

ఇదంతా ఏమిటో అర్థం కాకుండా చూస్తోంది లక్ష్మి. కొడుకు ఎందుకు మేక మాంసం కావాలంటున్నాడో అర్థం కాలేదు. తను ఎప్పుడూ వాడికి మేక మాంసం గురించి చెప్పలేదు.

అంతే. అంతవరకు వున్న ఆనందం నిముషాల్లో హరించుకుపోయిందక్కడ.

కోడలు హిరణ్మయి అప్పుడే నొసలుతో వెక్కిరిస్తూ, మూతి తిప్పుకొని వెళ్ళిపోయింది.

కుమార్‌ను, లక్ష్మిని అంటరాని వాళ్ళుగా భావించి వాళ్లకు దూరంగా జరిగేరు అంతా.

కుమార్ మాత్రం ఏడుస్తూనే వున్నాడు, "మేక మాంసం" అంటూ.

సరిగ్గా అప్పుడు చేతిలో సూట్‌కేస్‌తో మరొక చేత్తో పెద్ద సైజు కళింగరకాయ (పుచ్చకాయ) పట్టుకొని లోపలికొచ్చేడు మోహన్‌రావు.

తండ్రిని చూసిన వెంటనే ఒక్కసారిగా ఏడుపు ఆపి కాళ్ళకు చుట్టుకున్నాడు కుమార్.

చేతిలోని పళ్ళ బుట్టను వాడి కందించాడు. ఎవరూ "ఎప్పుడొచ్చేరు, ప్రయాణం కులాసాగా జరిగిందా!" అని పలకరించలేదు. ఏదో జరిగిందని గ్రహించేడు మోహన్రావు.

భార్యను పలకరించబోయేంతలో "ఇదిగో, నాన్న మేకను తెచ్చాడు. నాన్నా, మనల్ని అందరూ తిట్టున్నారు. మనం మేక మాంసం తినడం తప్పటగా! మనం మన ఊరికి వెళ్ళిపోదాం" అన్నాడు ఒక చేత్తో కళింగర కాయను పట్టుకుని.

అప్పటికి అర్థం అయింది మోహన్రావుకు. తను ఎప్పుడో సరదాగా కళింగరకాయను చూపి మేక మాంసం అని చెపితే వీడు అది పట్టుకుని అల్లరి చేశాడన్నమాట.

అప్పటికి విషయం అర్థమైన నరసింహశాస్త్రి మనవడ్ని పుచ్చకాయతో సహా దగ్గరకు తీసుకున్నాడు ఆప్యాయంగా. "వెధవా! కంగారు పెట్టి చంపేశావు కదరా మేక మాంసం అంటూ... ఇదేనా మేక. చెప్పు నీకెన్ని మేకలు కావాలో! నేను తెచ్చిస్తా" అంటూ. ●

ప్రముఖ రచయిత భైరవయ్య
పశ్చిమ గోదావరి కథల శీర్షిక
గలగలా గోదారి
వచ్చే వారమే పునః ప్రారంభం!